ఇందిరమ్మ ఇళ్ల సర్వే 75 శాతం పూర్తి



మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ –21 పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే 75 శాతం పూర్తి అయిందని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చందానగర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో సుమారు 24వేల ఇళ్ల దరఖాస్తులకు గాను 18వేల దరఖాస్తుల సర్వే పూర్తి చేశామన్నారు. మరో రెండు రోజుల్లో మిగిలిన 7వేల దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలని ఆదేశించామన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మణికొండ: డాక్టర్ ప్రభు మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో శనివారం మణికొండ లక్ష్మీప్రియ కాలనీలోని క్లినిక్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి తెలిపారు. షుగర్, బీపీ, లివర్ ఫైబ్రో స్కానింగ్, కంటి, దంత పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

వార్డు సభలు.. దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం ప్రజాపాలన వార్డు సభ నిర్వహించారు. సభలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కౌన్సిలర్ మంజుల అధికారులను కోరారు. కార్యక్రమంలో తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

డెమీగాడ్ క్రియేటివ్స్‌ను ప్రారంభించిన కిరణ్ అబ్బవరం



సాక్షి, సిటీ బ్యూరో: నగరంలోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన నూతన ప్రొడక్షన్ హౌస్, బీఎఫ్ఎక్స్ యానిమేషన్ స్టూడియోను నటుడు కిరణ్ అబ్బవరం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఫన్ మోజీ' అంటూ సోషల్ మీడియాలో అందరినీ నవ్వించే బృందం ఇకపై సినిమాలతో ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమయ్యిందన్నారు. మన్వంతర మోషన్ పిక్చర్స్‌పై కొత్త ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నారని తెలిపారు. ఇప్పుడు సినిమా ప్రొడక్షన్‌లోకి రాబోతున్నారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

మియాపూర్: మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కర్నూల్ జిల్లాకు చెందిన జి. పరుశురాం, శివలింగమ్మ(40) కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు నిమిత్తం 2023 సంవత్సరంలో నగరానికి వచ్చి మియాపూర్ మయూరినగర్‌లో ఉంటున్నారు. శివలింగమ్మ కూలీ పనులు చేస్తుండగా భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ శివలింగమ్మ బయటకు వెళ్లి వస్తానని కూతురుతో చెప్పి వెళ్లింది. కానీ రాత్రి అయినా కూడా తిరిగి రాలేదు. కాగా భర్త పరుశురాం కర్నూల్‌లో స్వంత గ్రామానికి వెళ్లాడు. రాత్రి అయినా కూడా తల్లి ఇంటికి రాకపోవడంతో కూతురు తండ్రికి సమాచారం ఇచ్చింది. పరుశురాం బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పరుశురాం శుక్రవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 13 మందికి రూ. 1500 జరిమానా, అదేవిధంగా ఒక్కరికి రూ. 2 వేలు జరిమానా, మరో ఇద్దరికి రూ .వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సందడిగా పశుసంక్రాంతి

జాతరలో వందల సంఖ్యలో పశువులు

- రూ. లక్షల్లో ధర పలికిన ఆవులు, గేదెలు
- ప్రధాన ఆకర్షణగా నిలిచిన పుంగనూరు ఆవులు



ఆవులకు పూజలు చేసి జాతరను ప్రారంభించిన చైర్మన్, వైస్ చైర్మన్‌లు



పశుసంక్రాంతిలో పాల్గొన్న జైపాల్‌రెడ్డి, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, డైరెక్టర్‌లు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం పశుసంక్రాంతి జాతర సందడిగా సాగింది. వందలాదిగా తరలించిన ఆవులు, గేదెలు, పుంగనూరు ఆవుల క్రయవిక్రయాలతో జాతర ఆద్యంతం నేత్రపర్వంగా జరిగింది. పుంగనూరు ఆవులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

- నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు గోవులు, గేదెలకు పూజలు చేసి పశు సంక్రాంతి జాతరను ప్రారంభించారు.
- గుజరాత్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి గేదెలు, ఆవులను ముస్తాబు చేసి అమ్మకానికి పెట్టారు. వాటి ధరలు ఏకంగా రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు ధరలు పలికాయి.
- షాబాద్ మండలం సంకెపల్లిగూడకు చెందిన సాయికృష్ణారెడ్డి అనే పాల వ్యాపారి మాత్రం దులియా జాతికి చెందిన రెండు గేదెలను ఒక్కొక్కటి రూ. 2.05 లక్షల చొప్పున కొనుగోలు చేశారు.
- పలువురు పాడి వ్యాపారులు రూ. లక్షలు పెట్టి వారికి నచ్చిన గేదెలు, దేశీ, జెర్సీ ఆవులను కొనుగోలు చేశారు.
- నిజాం కాలం నుంచి ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిని నిర్వహిస్తారు. పంటలను అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు పాడిపశువులను కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో మొదలైన పశుసంక్రాంతి ఒరవడి నేటికీ కొనసాగుతోంది.
- ఇదిలా ఉండగా... జిల్లాలో భూముల ధరలు పెరిగిపోవటం, వ్యవసాయం, డెయిరీల నిర్వాహకులు తగ్గిపోవటంతో పశువుల కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. వాటిని కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ నగరంతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చే పాడి వ్యాపారులు రాకపోవటంతో ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగలేదనే చెప్పొచ్చు. ప్రతి సంవత్సరం బ్యాండు, డప్పు చప్పుళ్లతో వాటిని ఊరేగించి విక్రయాలు చేసే ప్రక్రియకు తిలోదకాలు ఇవ్వడం పశుప్రేమికులను నిరాశకు గురిచేసింది.
- పశు సంక్రాంతిలో నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.దశరథయాదవ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేశ శ్రేయస్సు, స్థిరత్వానికి సామాజిక ఏకీకరణ అవసరం



మనూ విజిటింగ్ ప్రొ.ఇబ్రహీమ్ అల్లావుద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న 'మనూ' ప్రొఫెసర్లు

రాయదుర్గం: దేశ శ్రేయస్సు, స్థిరత్వానికి సామాజిక ఏకీకరణ కీలకమని కెనడా అల్బెర్టా విశ్వవిద్యాలయంలో మాజీ ప్రొఫెసర్, విద్యావేత్త,' మనూ' విజిటింగ్ ప్రొఫెసర్ ఇబ్రహీమ్ అల్లావుద్దీన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'మల్టీ కల్చరల్ సొసైటీలలో మైనార్టీల సామాజిక ఏకీకరణ యొక్క సవాళ్లు–విధానాలు ,పద్ధతులు, చిక్కులు' అనే అంశంపై 'మనూ' లా స్కూల్ సోషియాలజీ విభాగం సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాల స్థిరత్వం, శ్రేయస్సు కోసం మైనార్టీలను సామాజికంగా చేర్చడం అవసరమన్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా మైనార్టీ సంఘాలు ఎదుర్కొంటున్న చారిత్రక, రాజకీయ, సామాజిక అంశాలను ఉద్ఘాటించారు. 'మనూ' లా స్కూల్ డీన్, హెడ్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ హిలాల్ అహ్మద్, డాక్టర్ కెఎం జియావుద్దీన్, డాక్టర్ తౌసిఫ్‌ఉర్‌రహమాన్ ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సేవ్ గర్ల్ చైల్డ్.. ఎడ్యుకేట్ గర్ల్ చైల్డ్' ర్యాలీ





ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, సాంస్కృతిక ప్రదర్శన

రాయదుర్గం: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ టీమ్ ఆధ్వర్యంలో జీపీఆర్ఏ క్వార్టర్స్ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారత, లింగ, విద్య, ఉద్యోగాల్లో సమానత్వాన్ని ప్రోత్సహించడం అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్ళ గురించి అవగాహన కల్పించాలన్నారు. కాగా ర్యాలీలో 'సేవ్ గర్ల్ చైల్డ్', ఎడ్యుకేట్ గర్ల్ చైల్డ్, డాటర్స్ కెన్ బ్రైట్ యువర్ ఫ్యూచర్ వంటి నినాదాలతోకూడిన ప్లకార్డులు ధరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్‌సీఐఐఎన్‌వీ బయోసైన్సెస్' స్టార్టప్‌కు అరుదైన అవకాశం

మైక్రోసాఫ్ట్ 'ఏఐ' కాఫీ టేబుల్ బుక్‌లో అవకాశం

రాయదుర్గం: హెచ్‌సీయూలో స్టార్టప్‌గా ఎదిగిన ఎస్‌సీఐఐఎస్‌వి బయోసైన్సెస్‌కు ప్రతిష్టాత్మకమైన మైక్రోసాఫ్ట్‌కు ప్రత్యేకమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాఫీ టేబుల్‌బుక్‌లో అవకాశం లభించింది. మైక్రోసాఫ్ట్ సంస్థలోని కాఫీ టేబుల్ బుక్‌లో టాప్–200 ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లు కొనసాగుతున్నాయి. తమ వ్యాపారాలను మార్చుకోవడానికి ఏఐ శక్తిని ఉపయోగించుకుంటున్నాయి. ఈ స్టార్టప్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లను అంచనా వేయడానికి, రోగి ఆరోగ్య చరిత్రను ఏఐ/ఎంఎల్ అల్గారిథమ్‌లను ఉపయోగించేలా చేస్తుంది. ఈ అత్యాధునిక ఆవిష్కరణ ప్రయోగాల సామర్థ్య పరిమితులను అంచనా వేస్తుంది. హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ రెడ్డన్న, ఎస్‌సీఐఐఎన్‌వీ బయోసైన్సెస్ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ రంగారెడ్డి బుర్రి మాట్లాడుతూ అంటువ్యాధుల నివారణలో వేగం, ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



చందానగర్ : విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని వరల్డ్ వన్ పాఠశాల 11వ వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అంటే కేవలం మార్కులే కాదు, విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్, క్రాంతి కిరణ్, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. 15 కార్లు దగ్ధం

- వీవీఎస్ మోటార్స్‌లో కాలిపోయిన రూ.30 లక్షల నగదు
- కోటి 21 లక్షలు సేఫ్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని మహీంద్రా డీలర్ వీవీఎస్ మోటార్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కార్లు దగ్ధమయ్యాయి. వీవీఎస్ మోటార్స్ హెడ్ ఆఫీస్‌గా ఉన్న కార్యాలయంలో పలు ఫైళ్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.30 లక్షల నగదు కాలిపోయిందని, కోటి 21 లక్షల నగదు సేఫ్‌గా ఉందని వీవీఎస్ మోటార్స్ చైర్మెన్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో రాత్రి 10 గంటలకు అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్ని ప్రమాదంలో 5 థార్, 4 ఎక్స్‌యూవీ 700, 3ఈవీ, డెమో 3ఎక్స్ కారు కాలిపోయాయని షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. కాగా ప్రమాదానికి కారణం తెలియరాలేదని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ అబ్దుల్ ఫజల్ తెలిపారు. కార్లతో పాటు షోరూమ్ ఫాల్ సీలింగ్, ఫర్నిచర్ కాలిపోయాయని కోట్లలో ఆస్తి నష్టం ఉంటుందన్నారు. యాజమాన్యం మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

యువతిపై లైంగిక దాడి.. ఫిర్యాదు

గచ్చిబౌలి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఓ యువతి రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.మేస్త్రీ వీరబాబు(24) రాయదుర్గంలోని బీఎస్ఆర్‌హిల్స్‌లో కేర్ టేకర్‌గా పని చేస్తున్న యువతి(22)ని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. కృష్ణానగర్‌లోని ఓయో హోటల్‌కు తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తామని రాయదుర్గం పోలీసులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన టీఎన్‌జీఓ కాలనీవాసులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్థానికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే గాంధీని టీఎన్‌జీఓ కాలనీవాసులు కలిసి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మంచినీటి సరఫరా సమయం పెంచేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌ముదిరాజ్, ఎం సత్యనారాయణరావు, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సలావుద్దీన్, కాలనీవాసులు సుధాకర్, సంజీవయ్య, హనుమ, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు సాంకేతిక సహాయం

భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్



తాపీ మేస్త్రీల కోసం బ్యాగ్‌లు అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

గచ్చిబౌలి: భారతి సిమెంట్‌కు చెందిన అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌ను వినియోగించే వారికి సంస్థ ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తుందని టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని మనీష్ ఎంటర్‌ప్రైజెస్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర సిమెంట్‌తో పోల్చితే అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా చేపట్టవచ్చన్నారు. స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణాలకు సరైందని అన్నారు.భారతి సిమెంట్ ఇంజనీర్లు అల్ట్రాఫాస్ట్ వినియోగదారుల సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. డీలర్ మనీష్ రెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంట్ సత్వర సేవలందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ మార్కెటింగ్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, పలువురు తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

'ఆరోగ్యానికి మూలాధారం ఆహారపు అలవాట్లే'

లక్డీకాపూల్: ఆహార విధానంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం తగ్గించుకోవచ్చని ఆరోగ్య డైట్ కౌంటర్ నిర్వాహకుడు లక్ష్మణ్ పూడి తెలిపారు. ఈ విషయంలో ఆయుర్వేద వైద్యం ఇతోధికంగా దోహదపడుతుందన్నారు. గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య డైట్ కార్పొరేట్ కార్యాలయంలో జేడీ లక్ష్మీనారాయణ ఆయుర్ కల్పిట సిరప్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో షుగర్, బీపీ, థైరాయిడ్, ఒబెసిటీ వంటి అనారోగ్య సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయని, వీటన్నింటిని మన ఆహారంతో నయం చేసుకోవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మాతృశ్రీనగర్, మాధవనగర్ కొంత భాగం, ఓల్డ్ మాతృశ్రీనగర్ ఆఫీస్ ఏరియా, టెంపుల్ పార్కు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, రైల్వే స్టేషన్ ఏరియా, పోచమ్మ టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో.. శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మదీనాగూడ, కృషినగర్, ఎంఏనగర్,స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, వీడియాకాలనీ, మియాపూర్ మెయిన్ రోడ్డు, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, సత్య కళ్యాణ్ అపార్ట్‌మెంట్స్, ఎస్‌ఎంఆర్ మెట్రో పాలిస్, ఎస్‌ఆర్ ఎస్టేట్, వడ్డెర బస్తీ, విజేత సూపర్ మార్కెట్ లైన్, టాకీటౌన్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇజ్జత్‌నగర్ విలేజ్, శిల్పాహిల్స్ రోడ్డు నెంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ విల్లాస్, న్యాక్, ఖానామెట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

- మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు .. ఖాజాగూడ మెయిన్‌రోడ్డు, ఏసీ అట్లాంటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్ సెక్షన్, ఖాసాగూడ విలేజ్ ఓక్రిడ్జి స్కూల్, సాయి ఐశ్వర్య కాలనీ, సాయి వైభవ్ కాలనీ, అశోక్‌నగర్, ఖాజాగూడ ఘన్ శ్యామ్, వాసవి జీపీ, గోల్ఫ్ వ్యూ అపార్ట్ సంధ్య ఎలైట్, హెచ్‌ఎండీఏ బిల్డింగ్, సాస్ ఇన్‌ఫ్రా, జయభేరీ ఎన్‌క్లేవ్, ఎస్కీ, బ్రహ్మకుమారీస్, ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, గుడ్ గవర్నెన్స్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, జీపీఆర్ఏ క్వార్టర్స్, మూకో బ్యాంక్ లేన్, వినాయక్‌నగర్, ఐడీబీఐ వ్యాక్, టీజీఐఐసీ, వైఎస్సార్ భవన్, నానక్‌రాంగూడ విలేజ్, ఎస్‌సీ బస్తీ, పద్మశ్రీ గార్డెన్, ప్రశాంత్‌హిల్స్, జేవీ కాలనీ, కోమరం భీమ్, ఎన్‌వీడియా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నంబర్–3 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని గచ్చిబౌలి ఏఈ భాస్కర్ చెప్పారు.

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీ సబ్‌స్టేషన్ పరిధి.. గుల్‌మొహర్‌పార్కు కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గుల్‌మొహర్ పార్కు కాలనీ, నేతాజీ నగర్, మున్సిపల్ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

- దూబే కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆదర్శనగర్, బాపూనగర్, గోపీనగర్, లింగంపల్లి రైల్వే స్టేషన్ ఏరియాలో..
- డైమండ్ హిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సా. 5 గంటల వరకు డైమండ్‌హిల్స్, మంజీర పర్పుల్, గోపన్ పల్లి తదితర ప్రాంతాల్లో ..
- ప్రతిమ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రతిమ విల్లాస్, ముప్పారోడ్, తెల్లాపూర్ రోడ్, గోపన్‌పల్లి తండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

చందానగర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధి.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్స్, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధి.. ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్‌లో ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో..
- ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సమత కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, మార్కెట్, ప్రేమ్‌నగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు శిల్పా గార్డెన్స్, వెంకటేశ్వర లేఅవుట్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, నార్నె ఎస్టేట్స్, ప్రేమ్‌నగర్, న్యూ హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

ముగిసిన 'ఫోక్ ఫెస్ట్–2025'



రాయదుర్గం: హెచ్‌సీయూలో నిర్వహించిన ఫోక్ ఫెస్ట్–2025' శుక్రవారం ముగిసింది. రెండో రోజు ప్రదర్శనలు, పత్ర సమర్పణలు, చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందవర్మరాజ, డాక్టర్ రేతితమ్ పట్టి, డాక్టర్ ఇంతియాజ్‌అలీ పత్ర సమర్పణ చేశారు. అనంతరం లోక్ సంగీత్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో బిష్ణు, ప్రొఫెసర్ భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఎస్ఎస్ఎస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయ శర్మ కళాకారులను సత్కరించారు.

విధులతో పాటు పిల్లల బాధ్యత ముఖ్యం

రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్



సైబరాబాద్ కమిషనరేట్‌లో క్రెచే ప్రీస్కూల్‌ను ప్రారంభించిన డీజీపీ జితేందర్, సీపీ అవినాష్ మహంతి

గచ్చిబౌలి: మహిళా పోలీసు అధికారులు, పోలీసులు తమ విధులతో బాటు పిల్లల సంరక్షణను కూడా బాధ్యతాయుతంగా చూసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో క్రెచే ప్రీ స్కూల్‌ను ఆయన కమిషనర్ అవినాష్ మహంతితో కలిసి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆలోచన మేరకు సైబరాబాద్ కమిషనరేట్‌లో పనిచేసే సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఈ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్‌లో డీజీపీ సృజన ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల భద్రతా విభాగం ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించబడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ డి జోయల్ డేవిస్, డీసీపీ సృజన, డాక్టర్ మై స్కూల్ ఇటలీ వ్యవస్థాపకురాలు డాక్టర్ అపర్ణా వల్లూరు , పోలీసుల అధికారులు ప్రసన్నకుమార్, ఇతర అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.